క్లుప్తంగా

పోలింగ్ స్టేషన్లను కచ్చితంగా సందర్శించాలి

– ఈఆర్వో కిశోర్



సెక్టోరల్ రూట్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో కిశోర్

కాకినాడ రూరల్: ఎన్నికల విధులకు సంబంధించి సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులు కచ్చితంగా తమకు కేటాయించిన ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్లను సందర్శించాలని నియోజకవర్గ ఈఆర్వో, ఆర్డీఓ ఈట్ల కిశోర్ పేర్కొన్నారు. రమణయ్యపేటలో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నియోజవర్గంలోని సెక్టోరల్, రూట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. 264 పోలింగ్ కేంద్రాలను 144 జోన్లగా విభజించి 26 మంది సెక్టోరల్, రూట్ అధికారులను కలెక్టరు ఆదేశాల మేరకు నియమించామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే లోగా పోలింగ్ కేంద్రాలు సందర్శించి మౌలిక వసతులను పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారులు మురార్జీ, శ్రీనివాసరావు, డీటీ సురేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వన సమారాధన



దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేస్తున్న కోరమండల్ యూనిట్ హెడ్ శ్రీనివాసరావు

కాకినాడ రూరల్: అచ్చంపేట జంక్షన్ వద్ద మామిడి తోటల్లో కోరమాండల్ ఎరువుల కర్మాగారం సిబ్బంది వన సమారాధన గురువారం ఉత్సాహంగా జరిగింది. సిబ్బంది, కుటుంబ సభ్యులు సరదాగా గడిపారు. యూనిట్ హెడ్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు రూ.52 లక్షల విలువైన వినికిడి యంత్రాలు, మూడు చక్రాల సైకిళ్లు, మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోరమాండల్ అధికారులు పద్మనాభం, కిశోర్, మహిళా క్లబ్ నాయకులు వెంకట దుర్గావతి, మల్లీశ్వరి, శ్రీదేవి, లక్ష్మీ సృజన, పద్మావతి, విజయలక్ష్మి, మోహిని కుమారి తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి హుండీల ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి హుండీల ఆదాయాన్ని గురువారం దేవదాయశాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ సమక్షంలో లెక్కించారు. 9 నెలల వ్యవధికి రూ.3. 24 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. ఈ హుండీల లెక్కింపులో ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆలయ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలు అందించేందుకే సంకల్పయాత్ర

కరప: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందించేందుకే వికసిత్ భారత సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్టు జిల్లా ఇన్‌చార్జి రంబాల వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో గురువారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ ఆయుష్మాన్ భవ, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, తదితర పథకాలను లబ్ధిదారులకు అందజేశారు. దేశనాయకుల వేషధారణతో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బీజేపీ నాయకులు వై.మాలకొండయ్య, పి.లీలావతి, రెడ్డి రమణేశ్వర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ శిఖరం పునఃప్రతిష్ఠ

కరప: మండలం పెనుగుదురులోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా గురువారం ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ భక్తి,శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి సూర్యనారాయణాచార్యులు, వేణుగోపాలాచార్యులు, వేదపండితులతో కలిసి స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ పి.సత్యనారాయణరాజు, సర్పంచ్ రెడ్డిపల్లి వెంకటమాధవి, ఎంపీటీసీ బందారు సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

కరప: వేతనాలు పెంచాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక దీక్ష గురువారం 10వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల పరిధిలోని అంగన్‌వాడీలు, ఆయాలు కరపలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కాకినాడ రూరల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.వీరవేణి, కరప ప్రాజెక్టు నాయకురాలు పాల్గొన్నారు.



రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద కరప మండలానికి చెందిన శేషవేణికి మూడు చక్రాల స్కూటీ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



కరపలో సీఎం జగన్ జన్మదిన కేక్ కట్‌చేసి పంచుతున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు



రమణయ్యపేటలో ఆశ్రమ శ్రావణి వృద్ధుల ఆశ్రమంలో సీఎం జగన్ బర్త్ డే సందర్భంగా అన్నదానం

వేడుకగా జన హృదయ నేత జన్మదినం

- పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు
- ట్యాబ్‌లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కన్నబాబు
- లబ్ధిదారులకు వినికిడి మెషీన్లు, మూడు చక్రాల వాహనం, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
- ఆశ్రమ శ్రావణి ఆశ్రమంలో అన్నదానం

కాకినాడ రూరల్: పేదలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా సంక్షేమ పథకాలు వారి ఇంట సిరులు కురిపించాలని, ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాష్ట్ర ప్రజల గుండెల్లో జనహృదయ నేతగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గ ప్రజలు పండగలా నిర్వహించారు. పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో గురువారం సీఎం జగన్ బర్త్ డే వేడుకలు నిర్వహించారు. సుమారు 100 కేజీల కేక్‌ను కట్ చేసి అందరికీ పంచారు. నియోజకవర్గంలోని దివ్యాంగులకు వినికిడి మెషీన్లు, కరప మండలానికి చెందిన దివ్యాంగురాలు శేషవేణికి మూడు చక్రాల స్కూటీ, 13మందికి రూ.28లక్షలు విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం రమణయ్యపేట ఆశ్రమ శ్రావణి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ సీఎం జగన్ పుట్టిన రోజును నియోజకవర్గంలో పండగలా నిర్వహించామన్నారు. వృద్ధులకు అన్నదానం, వృద్ధాశ్రమాలలో పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కరప మండలంలో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. నియోజవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, కాకినాడ రూరల్, కరప జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జేఎన్‌టీయూకే వీసీ మెంబరు, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, సీనియర్ నాయకులు గోపుశెట్టి బాబ్జీ, అనుసూరి ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ వడ్డి మణికుమార్, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా, దోని శ్రీను, కరీం బాషా, గంజా సత్తిబాబు, విజయ సారథి, నల్ల రాణి, పుల్ల కోటేశ్వరరావు, చందు, క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు దడాల జాషువా గిరి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ విద్య, వైద్యం ప్రభుత్వ ధ్యేయం



అరట్లకట్ట హైస్కూలులో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



వైఎస్సార్ సీపీ క్లస్టర్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి దంపతులు

కరప: రాష్ట్రంలోని పేదలందరికీ విద్య, వైద్యం అందించడమే ధ్యేయంగా సీఎం జగన్ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలం అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ గోపి సత్యవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రూ.కోట్లాది నాడు-నేడు నిధులు ఖర్చుచేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారని కురసాల అన్నారు. పేదింటి పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్న ఉద్దేశంతో జగనన్న విదేశీ విద్యా దీవెన అమలుచేస్తున్నామన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలన్న ధ్యేయంతో సీఎం జగన్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ. 25 లక్షలకు పెంచారన్నారు. మండల పరిధిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల్లో 290 మందికి రూ.33 వేల విలువైన బైజూస్ ట్యాబ్‌లను స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే కన్నబాబు విద్యార్థులకు అందజేశారు. ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, గ్రామకమిటీ అధ్యక్షుడు సోడగం సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, ఎంఈఓ-2 పి.సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కరపలో..

కరప: మండలంలో సీఎం జగన్ జన్మదిన వేడుకలను సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గ్రామగ్రామాన కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. పీహెచ్‌సీలలో రోగులకు రొట్టెలు, పండ్లు, పాఠశాలల్లో విద్యార్థులకు చాక్లెట్లు పంచారు. కరపలోని చిరంజీవి కళ్యాణ మండపంలో జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైస్‌ఎంపీపీ పాట్నీడి భీమేశ్వరరావు, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మండలయూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితర పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మండలపార్టీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండలసర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, ఉపసర్పంచ్ భోగిరెడ్డి సూర్యనారాయణ, పార్టీ నాయకులు సాదే లోహిదాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టం తెలిసిన సీఎం జగన్

- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుక
- పేదలకు సేవా కార్యక్రమాలు

కాకినాడ: పేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి అధికారంలో కొనసాగినప్పుడే నిరుపేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలకు నేనున్నాంటూ అండగా నిలిచే సీఎం జగన్ మరోసారి అధికారంలోకి వస్తే పేదల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడతాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఎమ్మెల్యే ద్వారంపూడి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సంజయ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ క్లస్టర్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు. విశాల ప్రాంగణంలో సుమారు 10 డివిజన్ల పార్టీ కేడర్‌కు సౌకర్యవంతంగా ఉండేలా కార్యాలయం ఏర్పాటైంది. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సందడి చేశారు. కేక్ కట్ పంచారు. కార్యాలయాన్ని, ఇతర విభాగాలను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మహాలక్ష్మి దంపతులు, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో సీఎం జగన్ మంచి పరిపాలన అందించారని, నిండు నూరేళ్లు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మెషీన్ల పంపిణీ

వైఎస్సార్ సీపీ మైనార్టీసెల్ అధ్యక్షుడు ఖాలిద్‌బిన్ వలీ ఆధ్వర్యంలో పెద్ద మసీదు వద్ద సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలకు కుట్టు మెషీన్లు, దివ్యాంగులకు వీల్ చైర్లు పంపిణీ చేశారు. నగరంలోని మసీదులకు ఫైర్‌సేఫ్టీ మిషన్లు పంపిణీ చేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ బషీరుద్దీన్, పలువురు మైనార్టీసెల్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు.



కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న ద్వారంపూడి



విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కంటి వైద్య శిబిరం

అలాగే మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పిఠాపురం సీఎస్‌సీ హాస్పటల్‌కు చెందిన కంటి వైద్య నిపుణులు శిబిరానికి వచ్చిన 180 మందికి ఉచిత పరీక్షలు చేసి, 24 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని చిన్నారులతో ఎమ్మెల్యే ద్వారంపూడి కేక్‌కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతికేళ్ల 'ప్రెస్‌క్లబ్' కల సాకారం

కాకినాడ: కాకినాడ జర్నలిస్టుల పాతికేళ్ల చిరకాల వాంఛ ప్రెస్‌క్లబ్ భవన ఏర్పాటు గురువారం సాకారమైంది. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవతో స్థానిక రెవెన్యూకాలనీలో శాశ్వత ప్రాతిపదికన ఓ భవనాన్ని ఆయన సమకూర్చారు. గురువారం ఆయన దానిని ప్రారంభించి మాట్లాడుతూ తన హయాంలో భవనం సమకూర్చడం ఆనందంగా ఉందన్నారు. అక్రిడిడేటెడ్ జర్నలిస్టులు యూనియన్లకు అతీతంగా ప్రెస్‌క్లబ్‌ను సమర్థవంగా నిర్వహించడం ద్వారా ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ద్వారంపూడికి సత్కారం చేశారు. ఆదిత్య విద్యా సంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, ఎంఎహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ మాధవి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు హక్కు పత్రాల పంపిణీ

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేట పంచాయతీ ఏపీఐఐసీ కాలనీలోని దండుపుంత, ఈశ్వర్‌నగర్ పేదల చిరకాల కల నెరవేరింది. 40 ఏళ్ళుగా ఇళ్ళు నిర్మించుకుని ఉంటున్న వారికి శాశ్వత హక్కు కలిగేలా సీఎం జగన్ ఆశీస్సులతో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పొజిషన్ సర్టిఫికెట్లను అందించారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మొత్తం 127 మందికి ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. దండుపుంతకు చెందిన చెందిన 96 మందికి, ఈశ్వర్‌నగర్‌కు చెందిన 31 మందికి వారు ఉంటున్న ప్రాంతాల్లోనే పొజిషన్ సర్టిఫికెట్లను అందించారు. తహసీల్దార్ మురార్జీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ ఇండస్ట్రియల్ ప్రాంతంలోను, ఇరిగేషన్ తదితర ప్రాంతాల్లోని నివాస ప్రాంతాల వారికి పట్టా సాధ్యం కాదని, అయినప్పటికీ ఏళ్ల తరబడి గుడిసెల్లో ఉంటున్న పేదల కోసం తాను సీఎం దృష్టికి తీసుకువెళ్ళడంతో ఆయన సానుకూలంగా స్పందించి మార్గం సుగమం చేశారన్నారు. స్థానిక నాయకులు తుర్లంపూడి నాని, నాగు, కృష్ణంరాజు తదితరులను ఆయన అభినందించారు. జెడ్పీటీసీ నులుకుర్తి రామకృష్ణ, గోపిశెట్టి బాబ్జీ, గగారిన్, జంగా సత్తిబాబు, నేమాం సర్పంచ్ రామదేవు చిన్న, మాచవరపు సత్యనారాయణ, రావూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

శ్రీపాద శ్రీవల్లభ స్వామికి లక్ష బిల్వార్చన

పిఠాపురం: శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయుని జన్మస్థలమైన పిఠాపురంలో దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అమితంగా ఆకట్టుకున్నాయి.

జపతులకు వితరణ

కాకినాడ రూరల్: స్థానిక సర్పవరం శ్రీ పీఠం యాగశాల అవరణలో పరి పూర్ణానంద స్వామీజీ శత కోటి మహాశక్తి యాగంలో అమ్మవారికి చేసిన కోటి కుంకుమార్చన, శ్రీచక్రం కుంకుమ, 30లక్షల గాయత్రీ జపం చేసిన 23 మంది గాయత్రీ జపతులకు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమాలకు శ్రీపీఠం సూర్యనారాయణమూర్తి, టీమ్ లీడర్ కోటి గోపాలరావు నాయకత్వం వహించారు. స్వామి వారు అనుగ్రహ భాషణం చేస్తూ గాయత్రీ జపతులను అభినందించారు. తురగా సూర్యారావు మాట్లాడుతూ ఈ మహోన్నత పుణ్య కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. గాయత్రీ మాత అనుగ్రహం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.



జపతులకు ప్రసాదం అందజేస్తున్న పరిపూర్ణానంద స్వామీజీ

చురుగ్గా పూడికతీత పనులు

- రూ.30 లక్షలతో పూడికతీత
- ఎమ్మెల్యే కన్నబాబు చొరవతో నిధులు మంజూరు చేసిన కలెక్టర్

కరప: చింతపల్లి లాకుల నుంచి కరప మండలంలోని ఆయకట్టుకు సాగునీరు సరఫరా అయ్యే పంటకాలువల్లో పూడిక తీతపనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతుల వినతి మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు స్పందించి సీఎం జగన్, కలెక్టర్ కృతికాశుక్లా దృష్టికి తీసుకెళ్లడంతో నిధులు మంజూరయ్యాయి. దీంతో చింతపల్లి లాకుల నుంచి వచ్చే సంపర బోది, సంపర నుంచి దిగువకు వచ్చే గరువుకాలువల్లో పొక్లెయిన్లతో పూడికతీత పనులు సాగుతున్నాయి. మండల పరిధిలో 14 వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారు. ఇందులో రమారమి 12 వేల ఎకరాలకు సంపరబోధి, యండమూరు చానల్, కరప బోది ద్వారా సాగునీరు సరఫరా అవుతోంది. ఈ కాలువలు పూడుకుపోవడంతో సాగునీరు సక్రమంగా అందక కరప, పేపకాయలపాలెం, అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరిపల్లి, కూరాడ, వాకాడ, వేములవాడ, వలసపాకల, యండమూరు, జి.భావారం తదితర గ్రామాల్లోని ఆయకట్టు రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల 14న జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరుగుతుండగా మండలంలోని పలు గ్రామాల రైతులు జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, చింతా ఈశ్వరరావు స్థానిక నాయకులతో ఎమ్మెల్యే సమక్షంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. దీనికి ఆమె స్పందించి రూ.8 లక్షలు మంజూరు చేయడంతో ఒకటో తేదీన కాలువ పనులు ప్రారంభించారు. పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అయితే సంపరబోధి, యండమూరు చానల్ తవ్వించడం లేదని తెలియడంతో బండే తాతాజీ, రావుల ప్రసాద్, అడబాల ప్రసాద్ తదితరులు ఎమ్మెల్యే కన్నబాబుకు పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన స్పందించి నాలుగు పొక్లెయిన్లను పురమాయించడంతో ఆ పనులు సైతం చురుగ్గా జరుగుతున్నాయి. డీఈఈ ఆకెళ్ల రవికుమార్, ఏఈఈ ఎన్.నాగభవానీ దగ్గరుండి పంట కాలువలు తవ్విస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పూడిక తీయించక ముందు సంపరబోది దుస్థితి



పూడిక తీసిన తర్వాత సంపర బోది పంట కాలువ



కరప బోదిలో పూడిక తీసిన తర్వాత..




పంటకాలువల పూడికతీతపనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, పార్టీ నాయకులు

రూ.30 లక్షలతో పూడికతీత..

కరప మండలానికి వచ్చే పంటకాలువల్లో రూ.30 లక్షలతో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. కరప, సంపరబోది పూడిక తీత పూర్తయింది. యండమూరు చానల్‌కూడా మరో రెండు రోజుల్లో పూర్తికానుంది.

ఎమ్మెల్యే కన్నబాబు వల్లే పూడికతీత పనులు



చింతపల్లి లాకులనుంచి కరప మండలానికి వచ్చే మూడు పంటకాలువలు పూడుకుపోయి, అధ్వాన్నంగా తయారయ్యాయి. రైతులు వినతిమేరకు కరప గరువుకాలువకు మాత్రమే కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. సంపర బోది, యండమూరు చానల్ ఫొటోలు తీసి ఎమ్మెల్యేకు పంపడంతో ఆయన స్పందించి సత్వర చర్యలు చేపట్టడంతో తవ్వకం పనులు జరుగుతున్నాయి. రెండు మూడు రోజుల్లో పనులు పూర్తవుతాయి.

– బండే తాతాజీ, రైతు, కరప డీసీ మాజీ చైర్మన్, వేములవాడ

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

కరప: గ్రామాల్లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశించారు. మండలం గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాల్లో గురువారం స్థానిక నాయకులతో కలసి పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. గొడ్డటిపాలెంలోని రామాలయం వద్ద నిర్వహిస్తున్న సప్తాహంలో పాల్గొని పూజలు చేశారు. తర్వాత రూ.10 లక్షలతో నిర్మిస్తున్న గ్రామ దేవత మహాలక్ష్మి ఆలయ పునర్నిర్మాణ పనులు పరిశీలించారు. సర్పంచ్‌లు వాసంశెట్టి వెంకటరమణ, గోపి సత్యవేణి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, సోడగం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలి

కాకినాడ సిటీ: జనవిజ్ఞాన వేదిక నగర శాఖ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి చెకుముకి పరీక్షల్లో విజేతలకు గురువారం సాయంత్రం పీఆర్ కళాశాలలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.తిరుపాణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు విభిన్నంగా ఆలోచించాలని, పరిశోధనల వైపు దృష్టి సాధించాలని హితవు పలికారు. జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు ఆలపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ రాకెట్ యుగంలో కూడా అంధవిశ్వాసాలు మనుగడ సాగించడం విచారకరం అన్నారు. జేవీవీ రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. జేవీవీ ప్రతినిధి బీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ పరీక్షల్లో 48 పాఠశాలల నుంచి 202 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఒరుగంటి సత్యనారాయణ స్వరూప్, యూఎస్ రెడ్డి, కామాడి ఈశ్వరరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | RASMECC, కాకినాడ

ఇ-వేలం ద్వారా వాహనము అమ్మకం

ఈ దిగువ ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నుండి వాహనముల కొనుగోలు నిమిత్తం లోను సౌకర్యమును పొందియున్నారు. బ్యాంకుకు చెల్లించవలసిన వాయిదాలను సక్రమంగా చెల్లించనందున బ్యాంకు వారు వాహనములను స్వాధీనం చేసుకొని "యథాతథ స్థితి"లో వేలం ద్వారా దిగువ తెలిపిన తేదీన అమ్ముటకు నిర్ణయించినారు. ... ఈ క్రింది తెలిపిన వాహనమును ది.29-12-2023న బహిరంగ వేలమునకు టెండరు దారులను ఆహ్వానించడమైనది.

వ.నెం.	ఋణగ్రహీత పేరు & ఖాతా నెం. & బ్రాంచి పేరు	వాహనం & మోడల్	వాహనం నెం. & కలర్	రిజర్వు ధర & ఇఎండి
1	దూడల శ్రీనివాసరావు అకౌంట్ నెం.41654933277	SKODA Slavia Style 1.5Tsi AT 2023	T0223AP2333A Candy White	Rs.15,75,000/- Rs.1,57,500/-

ఇ-వేలం తేది మరియు సమయం: 29-12-2023, ఉ. 11.00 గం.ల నుండి సా. 4.00 గం.ల వరకు (అపరిమిత పొడిగింపు)

వాహనాల తనిఖీ కొరకు బ్యాంక్ పనిదినములలో సంప్రదించవలెను.

బిడ్స్ సమర్పించుకొనుటకు ఆఖరు తేది మరియు సమయం: 28-12-2023 న సా. 4.00 గం.ల లోపు.

ఆ తరువాత వచ్చిన బిడ్స్ అంగీకరించబడవు.

కనీస బిడ్ పెంపుదల మొత్తం: రూ.5,000/-

చీఫ్ మేనేజర్, SBI, RASMECC, కాకినాడ

ధరావత్తు సొమ్మును RTGS / NEFT ద్వారా చెల్లించిన పాటదారులు సాంకేతిక సమస్యలు తలెత్తినచో బ్యాంకు వారు బాధ్యత వహించరు.

నియమనిబంధనలు: (1) రిజర్వు ధర కన్నా తక్కువ ధరకు వాహనములు అమ్మబడవు. (2) ... (4) ... వాహన తనిఖీ కొరకు దారక రాము ఆఫీసియేట్స్: 9522233214 & +91 7673993111 నందు సంప్రదించగలరు. (5) ... (6) మరిన్ని వివరాల కొరకు అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చీఫ్ మేనేజర్, మొబైల్ నెం. +91 98665 33811 వారిని సంప్రదించగలరు. 7) ఇ-ఆక్షన్ సేవ: మెస్సర్స్ MSTC లిమిటెడ్, టోల్ ఫ్రీ ఫోన్ నెం.033-22901004ను సంప్రదించండి.

తేది: 21-12-2023 ప్రదేశం: కాకినాడ

సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, RASMECC, కాకినాడ